# నేటి నుంచి యువజ్యోతి జైత్రయాత్ర

## ప్రజ్వలనకు రానున్న యనమల

## యువగర్జన వేదికకు ఏడుగుర్రాల రథంపై ఊరేగింపు

**ఫిరంగిపురం:** నందమూరి వారసుల రాజకీయరంగ ప్రవేశం దిగ్విజయం అవ్వాలని, నారా చంద్రబాబునాయుడు మరోమారు ముఖ్యమంత్రి కావాలనే ఆశయంతో గురువారం నుంచి యువజ్యోతి జైత్రయాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి జె.ఆర్.పుష్పరాజ్ తెలిపారు. ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలో రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి బత్తుల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ వివరాలను బుధవారం ఆయన తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమానికి యువగర్జన కన్వీనర్, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎం.పి. ఎర్రన్నాయుడు, రాష్ట్ర తెలుగు మహిళాధ్యక్షురాలు రోజా, జిల్లాలోని 17 నియోజకవర్గాల తెదేపా ఇన్‌ఛార్జులు హాజరవుతారని చెప్పారు. గ్రామంలో ఏర్పాటు చేసిన హోమంలోని నిప్పుకణిక నుంచి యువజ్యోతిని యనమల రామకృష్ణుడు ప్రజ్వలన చేస్తారని తెలిపారు. ఈ యువజ్యోతి ప్రత్యేక రథంపై జిల్లాలోని 17 నియోజకవర్గాలను చుట్టి నవంబరు 4న తిరిగి వేములూరిపాడు చేరుకొంటుందని పేర్కొన్నారు. మళ్లీ అదేరోజు గ్రామం నుంచి ఏడు గుర్రాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంపై గుంటూరు పట్టణం మీదుగా అయిదోతేదీ సాయంత్రానికి యువగర్జన సభ జరగనున్న ఎన్టీఆర్ ప్రాంగణానికి చేరుకుంటుందని తెలిపారు. ప్రాంగణానికి చేరుకున్న యువజ్యోతిని బాలకృష్ణకు, బాలకృష్ణ నుంచి చంద్రబాబుకు అందించడం ద్వారా కార్యక్రమం పూర్తవుతుందని పేర్కొన్నారు.



సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం, వేదిక

### పేదలను అంబానీలుగా ఎప్పుడు చేస్తారు?

పేదలను అంబానీ, బిర్లాలుగా చేస్తానని ఎనిమిది నెలల క్రితం ప్రకటించిన ముఖ్యమంత్రి వై.ఎస్. ఇంతవరకు ఆ పథకాన్ని ఎందుకు ప్రారంభించలేదని మాజీ మంత్రి పుష్పరాజ్ ప్రశ్నించారు.



యజ్ఞవాటికను పరిశీలిస్తున్న పుష్పరాజ్, ప్రసాద్

ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ యువశక్తి ద్వారా 27 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని గొప్పలు చెప్పిన వై.ఎస్. 11 వేల మందికే ఉపాధిని కల్పించారని విమర్శించారు. సమావేశంలో మండల తెదేపా అధ్యక్షుడు చిట్టా వీరారెడ్డి, జిల్లా తెదేపా కార్యదర్శి గోలి బాలజోజి, తెదేపా రాష్ట్ర మహిళా కార్యదర్శి మానికంటి జయశ్రీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతురాజు ఉమాదేవి, రాష్ట్ర మహిళ కార్యవర్గ సభ్యురాలు పద్మావతి, జిల్లా వాణిజ్య విభాగపు కార్యదర్శి తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి, మానుకొండ ఆంజనేయులు, నల్లజర్ల అప్పయ్య, కొత్తపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.